# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- జీఎస్టీ సంస్కరణలతో రేపటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- తమ జీవితాలను సేవకు అంకితం చేసి దివ్యాంగులు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర రాష్ట్రాల్లో పర్యటించనున్నారు.
- భారత్ పాకిస్థాన్ జట్ల మధ్య జరుగుతున్న టీ-20 క్రికెట్ మ్యాచ్ లో టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది.

===================

జీఎస్టీ సంస్కరణలతో రేపటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు సాయంత్రం ప్రధానమంత్రి జాతినుద్దేశించి ప్రసంగించారు. 2017లో ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ ద్వారా నూతన అధ్యాయం మొదలైందని, దేశంలోని అన్ని వర్గాలతోనూ చర్చించాకే ఈ సంస్కరణలు తెచ్చామన్నారు. రేపటి నుంచి కేవలం రెండు శ్లాబులు మాత్రమే ఉంటాయని తాజా మార్పులతో వస్తు రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. పెట్టుబడులతో పాటూ ప్రజల పొదుపు కూడా పెరుగుతుందన్నారు.

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రకోటపై నుండి భావితరం GST సంస్కరణలను ప్రకటించారు. తదనుగుణంగా సెప్టెంబర్ 3న 56వ GST కౌన్సిల్ పన్నుల శ్లాబ్ లను హేతుబద్ధీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పరోక్ష పన్నుల వ్యవస్థను కౌన్సిల్ నాలుగు శ్లాబ్ ల నుండి రెండు శ్లాబ్ లకు కుదించింది. దీంతో 99 శాతం వస్తువులన్నీ ఇప్పుడు 5 శాతం, 18 శాతం పరిధిలోకి రానున్నాయి. పొగాకు, విలాసవంతమైన వస్తువులతో సహా ఎంపిక చేసిన వస్తువులపై మాత్రం 40 శాతం అదనపు శ్లాబ్ ను ప్రవేశపెట్టింది. ఈ నూతన జీఎస్టీ తగ్గింపుల మేరకు అల్ట్రా-హై-టెంపరేచర్ పాలు, పన్నీర్, పిజ్జా, బ్రెడ్, చపాతీ వంటి ఆహార పదార్థాలపై పన్ను శాతాన్ని

మినహాయించింది. ట్రాక్టర్లు, హార్వెస్టింగ్ యంత్రాలు, కంపోస్టింగ్ యంత్రాలు వంటి వ్యవసాయ పరికరాలపై GSTని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించింది. ప్రభుత్వం 350 సిసి వరకు ఉన్న ద్విచక్ర వాహనాలపై GSTని 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించింది. గతంలో 28 శాతం శ్లాబ్ లో భాగమైన చిన్న కార్లను కూడా భావితరం GST సంస్కరణల కింద 18 శాతానికి తగ్గించింది.

====================

తమ జీవితాలను సేవకు అంకితం చేసి దివ్యాంగులు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. జోధ్‌పూర్‌లోని శ్రీ పర్స్మల్ బోహ్రా అంధుల కళాశాల నూతన భవనాల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ఈరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... దివ్యాంగులను సానుభూతితో చూడకూడదని, దైవత్వానికి చిహ్నలుగా చూడాలన్నారు. సామాజిక సేవలో చిన్న చిన్న కార్యక్రమాలు దివ్యాంగుల కోసం పెద్ద మార్పులను సృష్టించగలవని చెప్పారు. సమాజం, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సమిష్టి కృషితో ఏదీ అసాధ్యం కాదని అమిత్ షా మాట్లాడుతూ...

(వాయిస్ 40 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ప్రధాని ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. అరుణాచల్ ప్రదేశ్‌లో 3 వేల 700 కోట్ల రూపాయల విలువైన రెండు ప్రధాన జలవిద్యుత్ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఇక త్రిపురలో మాతాబరి వద్ద ఉన్న మాతా త్రిపుర సుందరి ఆలయ సముదాయం అభివృద్ధి పనులను ప్రధానమంత్రి ప్రారంభిస్తారు.

====================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా స్మార్ట్ సిటీ మిషన్ పై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 105 సెకన్లు)

విరామం

====================

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధికారిక పర్యటన నిమిత్తం ఈరోజు మొరాకో దేశానికి బయలుదేరనున్నారు. భారతదేశం, మొరాకో దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక కలయికను ఈ పర్యటన సూచిస్తోంది. ఇరు దేశాల మధ్య రక్షణ, వ్యూహాత్మక, పరిశ్రమ సహకారాన్ని బలోపేతం చేయడానికి ఈ పర్యటన సందర్భంగా మొరాకో రక్షణ మంత్రి అబ్దెల్లతిఫ్ లౌడియితో ద్వైపాక్షిక సమావేశం నిర్వహిస్తానని రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో తెలిపారు. బెర్రెచిడ్‌లో మొట్టమొదటి భారతీయ రక్షణ తయారీ కర్మాగారానికి రాజ్‌నాథ్ సింగ్ శంకుస్థాపన చేయనున్నారు.

====================

చైనాలో జరుగుతున్న ప్రపంచ స్పీడ్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ కు ఆనంద్‌కుమార్ వెల్‌కుమార్ పురుషుల 42 కిలోమీటర్ల మారథాన్‌లో స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఈవెంట్‌లో

అతనికి ఇది మూడవ పతకం. ఆనంద్‌కుమార్ ఇప్పటికే 1000 మీటర్ల పరుగులో స్వర్ణ పతకంతో పాటూ 500 మీటర్ల స్ప్రింట్‌లో కాంస్యం సాధించారు. దీంతో భారతదేశానికి మొట్టమొదటి స్పీడ్ స్కేటింగ్ ప్రపంచ ఛాంపియన్ గా నిలిచాడు.

====================

ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో రేపటి నుండి రెండు రోజుల పాటూ 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సు జరగనుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, కేంద్ర ఐటీ ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ సదస్సుని నిర్వహిస్తున్నాయి. వికసిత్ భారత్ సివిల్ సర్వీస్ అండ్ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మింగ్ అనే ఇతివృత్తంతో జరిగే ఈ సదస్సుని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి జితేంద్ర సింగ్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు.

====================

ఆసియా కప్ 2025 లో భాగంగా భారత్ పాకిస్తాన్ జట్ల మధ్య టీ20 క్రికెట్ మ్యాచ్ దుబాయ్ వేదికగా కొద్ది సేపటి క్రితం ప్రారంభమయ్యింది. తొలుత టాస్ గెలిచిన భారత జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ ప్రారంభించిన పాకిస్తాన్ 4 ఓవర్లు పూర్తయ్యే సరికి ఒక వికెట్ నష్టపోయి 36 పరుగు చేసింది.

====================

ఉత్తర బంగాళాఖాతంలో రానున్న 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 26న దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. సెప్టెంబర్ 27న దక్షిణ ఒడిశా-ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలను దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఈ అల్పపీడన ప్రభావంతో... ఒడిస్సాలో 23 నుంచి ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, విదర్భలో 24 నుంచి భారీ వర్షాలు కురిసే అవాకాశం ఉందని తెలిపింది.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ వచ్చే ఆదివారం ప్రసారమవుతుంది.

====================
====================